క్లుప్తంగా

గ్రీవెన్స్‌తో సమస్యల పరిష్కారం


సిబ్బందితో డ్రిల్ నిర్వహిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: పోలీస్ సిబ్బందికి ప్రతి శనివారం నిర్వహించే గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఐ సోమశేఖర్ అన్నారు. శనివారం కొండపి సర్కిల్‌లోని స్థానిక సర్కిల్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సిబ్బంది డ్యూటీపరంగా, కుటుంబపరంగా ఉన్న సమస్యలు, ఆరోగ్యపర సమస్యలను గురించి సమాచారం గ్రీవెన్స్‌లో ఇవ్వచ్చన్నారు. ముందుగా సిబ్బందితో డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్‌కుమార్, మర్రిపూడి ఎస్సై రమేష్ బాబు, పొన్నలూరు ఎస్సై అనూక్, ఏఎస్సై అంకారావు, సర్కిల్‌లోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యతో అక్షరాస్యత పెంపు


వీవోఏలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పీసీపల్లి: వయోజన విద్యతో అక్షరాస్యత సాధించవచ్చని తహసీల్దార్ ఉష పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వీవోఏలు గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులకు సంబంధించి అందరికీ సంతకాలు నేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. 18–60 సంవత్సరాల్లోపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏపీఎం సత్యానందం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో 6 పంచాయతీల్లో 629 మంది నిరక్షరాస్యులను గుర్తించామని చెప్పారు.

హౌసింగ్ సిబ్బందిపై పీడీ ఆగ్రహం


ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ ప్రసాద్

జరుగుమల్లి (సింగరాయకొండ): అధికారులు తమ బాధ్యత మరిచి కార్యాలయాలకు ఆలస్యంగా వస్తున్నారు. జరుగుమల్లి మండల గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని హౌసింగ్ పీడీ ప్రసాద్ శనివారం ఉదయం 10.40 గంటల సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆఫీసు గది తాళాలు తెరిచి ఉన్నాయే తప్ప ఒక్క అధికారి కూడా లేడు. దీంతో హాజరు పట్టికను తనిఖీ చేయాలన్నా అది కూడా కనబడలేదు. దీంతో ఆగ్రహించిన పీడీ ప్రసాద్ వెంటనే ఫోన్ ద్వారా ఏఈ సింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ఒంగోలుకు వచ్చి కలవమని ఆదేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పీడీ ప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్ సెలవులో ఉన్నాడని మిగిలిన వారిని విధులు సక్రమంగా నిర్వహించాలని హెచ్చరించానని వివరించారు.

రోడ్డు భద్రత నిబంధనలతో ప్రమాదాల నివారణ


వేములపాడులో సూచలిస్తున్న ఎస్సై మాధవరావు

కనిగిరి రూరల్/పొన్నలూరు/హనుమంతునిపాడు: రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతలను పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎస్సై మాధవరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం రోడ్డు మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఎం మొహమ్మద్ సయాన బేగం, ప్రిన్సిపాల్ టీ రమణారెడ్డిలు రోడ్డు భద్రతలపై డ్రైవర్లకు, ఆర్టీసీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

✎ పొన్నలూరులో పరిమితికి మించి ప్రయాణికులు, కూలీలతో వెళ్తున్న ఆటో, ట్రాక్టర్లను ఆపి ఎస్సై అనూక్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

✎ ఆటోలు మిని వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. వేములపాడు వద్ద కంభం-కనిగిరి రోడ్డులో వాహనాలను ఆపి డ్రైవర్లకు, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.


పొన్నలూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

మద్యం మత్తులో మాచవరం


మాచవరం కొండ వద్ద ఎస్టీ కాలనీ పక్కనే ప్రధాన రహదారిలో ఉన్న బెల్టు షాపు


ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన బెల్టు షాపు

- పగలురాత్రి తేడా లేకుండా తూలుతున్న మందుబాబులు
- సంక్రాంతి పండుగ ముగిసినా రద్దీ తగ్గని బెల్టు షాపులు
- బాటిల్‌కు రూ.100కు పైగా అదనంగా అమ్ముతున్న వైనం

కందుకూరు రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. కొత్త సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా మందుబాబులు తాగి ఊగారు. ఇదే అదనుగా చేసుకున్న బెల్టు షాపుల నిర్వాహకులు బాటిల్‌పై ఎక్కువ రేటు వేసి అమ్ముకుంటూ గ్రామ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. మండలంలోని మాచవరం గ్రామం మద్యం మత్తులో తూలుతోంది. గ్రామంలో సుమారుగా ఆరు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ పూర్తైనా బెల్టు షాపుల వద్ద మద్యం ప్రియులు కిటకిటలాడుతున్నారు. ఇదే అదనుగా భావించిన బెల్టు షాపుల నిర్వాహకులు ఒక బాటిల్‌పై రూ.100 నుంచి రూ.120 వరకు అదనంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారు చెప్పిందే ధరగా మద్యం కొనుగోలు చేస్తున్నారు మందుబాబులు.

రెస్టారెంట్‌ను తలపిస్తున్న బెల్ట్ షాపులు..

గ్రామంలోని కొండ వద్ద ఎస్టీ కాలనీ వద్ద ప్రధాన రహదారి పక్కనే బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. ఆ షాపులో రెస్టారెంట్‌లా అన్ని అందుబాటులో ఉంటాయి. మద్యంతోపాటు పక్కనే కూర్చొని తాగి తినేందుకు తినుబండారాల కూడా ఏర్పాటు చేశారు. ఇక రాత్రి వేళల్లో ఈ షాపుల వద్దే హడావుడి మామూలుగా ఉండదు. రోడ్డుపై వాహనాలు నిలిపి షాపులోకి వెళ్లి మద్యం తాగుతున్నారు. అదే విధంగా ఎస్సీ కాలనీలో మరో రెండు షాపులు యథేచ్ఛగా నడుపుతున్నారు. బద్దిపూడి రోడ్డులో ఒకటి, ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో మరొకటి, లోపలికి మరో మద్యం బెల్టు షాపులు జోరుగా సాగుతున్నాయి. పేదల ప్రజలు సరదాగా పండుగలకు మద్యం సేవించే వారు కాస్తా ప్రస్తుతం ఇళ్ల వద్ద, ఊరిలోనే మద్యం అందుబాటులో ఉండడంతో నిత్యం మద్యం మత్తులోకి వెళ్తున్నారు మందుబాబులు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు..

అధిక ధరలు చెల్లించి మరీ కొనుగోలు చేసి ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఎస్టీ కాలనీ వద్ద మూడు బెల్టు షాపులు నిర్వహిస్తుండడంతో ఎస్టీ యువకులు మందులకు బానిసలువుతున్నారు. రోజంతా కూలీనాలి చేసిన డబ్బంతా మద్యానికి తగలేస్తున్నారు. అదే గ్రామంలో బెల్టు షాపులు లేకపోతే మద్యం కావాలనుకునే వారు కందుకూరు, గుడ్లూరు ప్రాంతాలకు వెళ్లి మద్యం తెచ్చుకునే పరిస్థితి ఉండేది. అలాంటిది ఈ ప్రభుత్వంలో ఇళ్ల పక్కనే మద్యం అమ్ముతూ పేదల జీవితాలను నాశనం చేస్తున్నారని గ్రామస్తులు తోపాటు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు కూడా నెలకు ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పున్నారని సమాచారం. ఇప్పటికైనా అధికారులు బెల్టుషాపులను నిర్మూలించాలని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **పరిశీలించి చర్యలు తీసుకుంటాం..**
> మాచవరంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చింది. రేపు లేదా ఎల్లుండి సిబ్బందితో దాడి చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అక్రమంగా మద్యం కలిగి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
> – టీ వెంకటరావు, ఎక్సైజ్ సీఐ

కనిగిరిలో విజయకేతనం ఎగుర వేస్తాం


కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీలు, చైర్మన్ గఫార్, పార్టీ నేతలు


పార్టీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ గఫార్, జెడ్పీటీసీలు, పార్టీ నేతలు

- కనిగిరి ఇన్‌చార్జిగా ఏడాది పూర్తి చేసుకున్నా దద్దాల
- పార్టీ ఆఫీసులో కేక్ కటింగ్, న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జిగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించి నేటికి ఏడాది పూర్తి కావడంతో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం అభినందన, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నియమించిన దద్దాల నారాయణ యాదవ్ నిరంతరం పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. నారాయణ నాయకత్వంలో తామంతా కలిసి కట్టుకగా పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కనిగిరి నియోజకవర్గంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ మూడు సార్లు అవకాశం కల్పించారన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందినప్పటికి నిరంతరం ప్రజల్లో ఉంటున్నారన్నారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు తమ్మినేని సుజాతరెడ్డి, పీసీపల్లి మండల అధ్యక్షుడు గోపవరపు బొర్రారెడ్డిలు మాట్లాడుతూ దద్దాల నారాయణ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. దద్దాల నారాయణ యాదవ్ నాయకత్వంలో 2029లో కనిగిరిలో అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీపల్లి జెడ్పీటీసీ ఒకేరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, చింతం శ్రీనివాసుల యాదవ్, అవుల భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీను, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, డాక్టర రసూల్, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, చింతంగుంట్ల కిషోర్, సంగటి మహేంద్రారెడ్డి, ఇండ్లా శ్రీకాంత్, నాగమణి, నాగూర్‌బీ, భారతీ, షకీలా, సుస్మితా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆదేశాల మేరకు పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆవిష్కరించారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి


స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చైర్మన్ గఫార్, కమిషనర్


సింగరాయకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో జయమణి, అధికారులు

కనిగిరి రూరల్/పామూరు/సీఎస్‌పురం (పామూరు): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్ మాట్లాడుతూ స్వచ్ఛతా అనేది ప్రజల జీవన విధానంలో భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, మెప్మా సీఎంఎం రఘు, శానటరీ సెక్రటరీలు, పారాలీగల్ వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

☛ పామూరు మండలం రావిగుంటపల్లె గ్రామంలో డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, డీఎల్‌పీఓ హనుమంతరావు స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్నారు. గ్రామంలోని పలువురితో పారిశుధ్యంపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

☛ సీఎస్‌పురంలో ఈఓ వి.బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ శ్రీరామ పద్మావతి ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీను, బత్తుల వెంకటాద్రి పలువురు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలకు పాటు పడాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో డీ జయమణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.


సీఎస్‌పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


రావిగుంటపల్లెలో గ్రామస్తులతో అధికారులు

నవోదయ పరీక్షకు 262 మంది హాజరు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన నవోదయ పరీక్షకు 486 మంది విద్యార్థులకుగాను 262 మంది హాజరైనట్లు ఎంఈవో కత్తి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 246 మందిలో 143 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మందిలో 119 మంది హాజరైనట్లు ఆయన వివరించారు. ఈసారి ఎక్కువ మందిచేత దరఖాస్తు చేయించాలని అధికారులు ఒత్తిడి తెచ్చారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. అంతేకాక గతంలో ఎన్నడూ లేని విధంగా దరఖాస్తు ఫారాలు కూడా ముందే పాఠశాలలకు పంపారని తెలిపారు. కాని తీరా పరీక్షకు మాత్రం 486 మందికి గాను కేవలం 262 మంది మాత్రమే హాజరయ్యారని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు.

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని ఆల్ఫా హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల రెండు కేంద్రాల్లో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు మొత్తం 533 గాను 219 మంది హాజరుకాగా 314 మంది గైర్హాజరయ్యారు. అల్ఫాస్కూల్ సెంటర్‌లో 245 కు 84 మంది హాజరుకాగా 161 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 288 మందికిగాను 135 మంది హాజరుకాగా 153 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు బాలక్రిష్ణ, జి.కోటిరెడ్డిలు, డీఓ సయ్యద్ ఇసాక్‌లు పర్యవేక్షించగా స్క్వాడ్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు.

23న వెలిగొండ జలాల సాధన సదస్సు

కనిగిరి రూరల్: వెలుగొండ జలాలతోనే పశ్చిమ ప్రాంత ప్రజల వెనుకబాటుతనం పోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 23న కనిగిరిలో వెలిగొండ జలాల సాధన సదస్సు జరుగుతుందని తెలిపారు. 23న మధ్యాహ్నం 2 గంటలకు పునర్ నిర్మాణం జరిగిన సుందరయ్య భవనం ప్రారంభం, 2.30 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సుగుణమ్మ సెంటర్ వరకు ర్యాలీ ప్రదర్శన, అనంతరం 3 గంటలకు సాధన సదస్సు జరుగుతుందని చెప్పారు. ఈ సదస్సుకు సీపీఎం పొలిట్ బ్యూరో బీవీ రాఘవులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, ఆర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కనిగిరి రూరల్: రైతు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరని అవలం భిస్తున్నాయని ఏఐకేఎస్ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో శనివారం రైతు సంఘ సమావేశం గుజ్జుల బాలిరెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో వీరారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తదనుగుణంగా చట్టం తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఎస్‌డీ మౌలాలి, రైతు నాయకులు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా

- నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల


మాజీ సీఎం జగన్‌తో దద్దాల (ఫైల్)

కనిగిరి రూరల్: సామాన్య కార్యకర్తగా, జెడ్పీటీసీగా ఉన్న తనను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని ఆ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. దద్దాలను ఇన్‌చార్జిగా ప్రకటించి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న పట్టుదల, ధైర్యం, సాహసం, పోరాట పటిమ తనకు ఆదర్శం, స్ఫూర్తి అన్నారు. జగనన్న అడుగు జాడల్లో నడుస్తూ, పార్టీ పిలుపు నిచ్చే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కూటమి సర్కార్ చేసిన, చేస్తున్న తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, ఎన్నికల హామీల అమలుకై పోరాడుతానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిల ఆశీస్సులతో కనిగిరి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులందరిని కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జండా ఎగుర వేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన వెంటనడుస్తున్న పార్టీ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా వేణుగోపాలస్వామి అభిషేకోత్సవం


స్వామివార్లకు పట్టువస్త్రాలు, నైవేద్యంతో ఈఓ, భక్తులు

పామూరు: మండల కేంద్రం పామూరు రుక్మిణి సత్యభామా సమేత మదనవేణుగోపాలస్వామివారి అభిషేకోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుక్మిణి, సత్యభామ, మదనవేణుగోపాలస్వామివార్ల మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం విశిష్ట అలంకరణగాంచి దాతుల సమకూర్చిన పట్టువస్త్రాలను స్వామివార్ల విగ్రహమూర్తులకు అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం మహానైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజా కైంకర్యాలను ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షించగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కృష్ణారావు, ఓగూరి ఏడుకొండలు, తిరుపతయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సావిత్రి

హనుమంతునిపాడు: యువత క్రీడల్లో గెలపోటములను సమానంగా చూడాలని ఎంపీపీ గాయం సావిత్రి పేర్కొన్నారు. మండల పరిధిలోని దొడ్డిచింతలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కోటపాటి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీలో 30 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతి దొడ్డిచింతల యూత్ ఫోర్స్ టీమ్ నిలవగా బహుమతిని యర్రంరెడ్డి సురేష్‌రెడ్డి రూ.20 వేలు అందించారు. రెండో స్థానంలో నిలిచిన కనిగిరి టీంకు ఎంపీపీ రూ.15 వేలు అందించగా, తృతీయ బహుమతి దొడ్డిచింతల బీ టీమ్‌కు చిట్యాల విజయ్ భాస్కర్‌రెడ్డి రూ.10 వేలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షులు శ్యామల సాంబిరెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి నారాయణస్వామి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, రుద్రపాటి రాజు, కలుకూరి చిన్న, కె.నారాయణ, కోటపాటి మోహన్‌రెడ్డి,యర్రంరెడ్డి రాజారెడ్డి, కొదమల తిమోతి, పరిసపోగు జాన్, జి.జీవన్, కొండెపోగు లాజర్‌గుడిమిట్ల శేఖర్, కొదమల సూర్య తదితరులు ఉన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రాజ్‌కుమార్

కనిగిరి రూరల్: ప్రభుత్వం పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక కార్యాలయంలో జోనల్ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఆర్‌సీ పట్ల సుముఖత వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పీఆర్‌సీ, మధ్యంతర భృతిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1–5 తరగతులు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు తోటా శ్రీనివాసులు, ఇండ్లా ప్రసాద్, జేఎస్ ఆనంద్, ఏ హజరత్ రెడ్డి, కేవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో ఉపయోగాలు


రైతులతో మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి: ఈ-క్రాప్ నమోదు చేసుకోవడంతో పలు ఉపయోగాలు ఉన్నాయని ఏవో డీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్ద కండ్లకుంట జాళ్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులతో పంట నమోదు చేసుకోవాలని, అదేవిధంగా గ్రామంలో భూమి కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతు ఎన్పీఎస్ఎస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు షేక్ మహేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కనిగిరి డీఎస్పీగా యశ్వంత్

ఒంగోలు టౌన్: కనిగిరి డీఎస్పీగా పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన యశ్వంత్‌కు ఇదే తొలి పోస్టింగ్. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎం.మహేశ్వరరావు సరిగ్గా నెల రోజుల కిత్రం డిసెంబర్ 20న బాధ్యతలను చేపట్టారు. ఆయన ఎక్కువ కాలం ఉత్తరాంధ్రలో పనిచేసినట్లు సమాచారం. నెల రోజుల్లోనే డీఎస్పీ బదిలీ కావడం జిల్లా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కనిగిరి రూరల్: స్వర్గీయ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.